

జిల్లాలోని ఓ ఎంపీ, ఏడు ఎమ్మెల్యే స్థానాలకు వైసీపీ అభ్యర్థులు ఖరారయ్యారు. పుంగనూరు నుంచి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పోటీ చేస్తున్నారు. ఇక్కడ ఈసారి త్రిముఖ పోటీ నెలకొంది. టీడీపీ నుంచి చల్లా రామచంద్రారెడ్డి, బీసీవై నుంచి రామచంద్రయాదవ్ పోటీ పడుతున్నారు. పుంగనూరులో విపక్షాల మీద దాడులు, అక్రమ కేసులు ఎక్కువయ్యాయి. పుంగనూరు అల్లర్ల ఘటనలో వందలమంది టీడీపీ శ్రేణులపై హత్యాయత్నం కేసులు పెట్టి జైల్లో వేశారు. ఇటీవల 60మందికిపైగా టీడీపీ నాయకుల మీద రౌడీ షీట్ నమోదు చేయించారు. ఎన్నికల్లో యాక్టివ్‌గా ఉండే టీడీపీ శ్రేణులే లక్ష్యంగా పెద్దిరెడ్డి ఇలా ఇబ్బందులు పెట్టారని టీడీపీ, బీసీవై ఆరోపిస్తున్నాయి. రౌడీషీట్లు, హత్యాయత్నం కేసుల పేరుతో ఎన్నికల సమయంలో టీడీపీ శ్రేణుల్ని బైండోవర్ చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారని చల్లా రామచంద్రారెడ్డి ఆరోపిస్తున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

వైసీపీ ఎదురీత

● సమన్వయకర్తలకే టికెట్ల ఖరారు ● నాలుగు సీట్లలో ముందే క్లారిటీ

కుప్పం మీదా పెద్దిరెడ్డి నీడ

కుప్పం నుంచి ఎమ్మెల్సీ భరత్ పోటీ చేయనున్నారు. 2019 ఎన్నికల్లో భరత్ తండ్రి, మాజీ ఐఏఎస్ అధికారి చంద్రమౌళి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన అనారోగ్యంతో మరణించడంతో భరత్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. కానీ, మంత్రి పెద్దిరెడ్డి పూర్తిస్థాయిలో కుప్పం నియోజకవర్గాన్ని పర్యవేక్షిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్రమ ఏకగ్రీవాలు, పెద్దఎత్తున డబ్బుల పంపిణీ కారణంగా ఎక్కువ స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది. ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఇటీవల సీఎం జగన్ హంద్రీనీవా కుప్పం బ్రాంచి కెనాల్ నుంచి నీళ్లను వదిలి హంగామా చేశారు. వైసీపీ ఎన్నికల స్టంట్ చేసినా, ఇప్పుడు అక్కడ నీళ్ల లేకుండా కాలువ ఎండిపోయింది.

విజయానందరెడ్డిపై ఉమ్మడిపోరు

చిత్తూరు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి అని జనవరిలోనే స్పష్టత వచ్చేసింది. అప్పటినుంచి ఆయన విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఎర్రచందనం స్మగ్లింగు కేసుల్లో నిందితుడిగా ఉండిన ఆయన్ను ఎలాగైనా ఓడించాలని చిత్తూరుపై దశాబ్దాలుగా ముద్ర వేసిన రాజకీయ కుటుంబాలన్నీ నడుం బిగించాయి. టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్‌కే మద్దతు ఇస్తున్నాయి.

పూతలపట్టులో గెలవాలన్న కసితో టీడీపీ

పూతలపట్టులో మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు టికెట్‌ను ఖరారు చేశారు. తనకు టికెట్ ఇవ్వకపోవడంతో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. సునీల్‌కుమార్ విస్తృతంగా పర్యటిస్తూ ఉండగా.. ఎంఎస్ బాబు సహకరించకుంటే వైసీపీకి ఇబ్బందులు తప్పవు. మరోవైపు నియోజకవర్గ విభజన తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లోనూ ఇక్కడ టీడీపీ గెలవలేదు. దీంతో ఈసారి ఎలాగైనా గెలవాలని టీడీపీ నాయకులు కసిగా కష్టపడుతున్నారు.

రెండోసారి ఎంపీగా రెడ్డెప్ప పోటీ

చిత్తూరు ఎంపీగా రెడ్డెప్ప రెండోసారి పోటీ చేయనున్నారు. న్యాయవాద వృత్తిలో ఉంటూ, పెద్దిరెడ్డి కుటుంబానికి నమ్మినబంటుగా చెప్పుకునే రెడ్డెప్ప 2019 ఎన్నికల్లో తొలిసారి చిత్తూరు ఎంపీగా పోటీ చేశారు. ఈసారి టీడీపీ నుంచి మాజీ ఐఆర్ఎస్ అధికారి ప్రసాదరావు ఆయనపై బరిలో ఉండే అవకాశముంది.

కృపాలక్ష్మికి వ్యతిరేకవర్గం సహకరించేనా..?

గంగాధర నెల్లూరులో డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మిని అభ్యర్థిగా ప్రకటించారు. ఇక్కడ మాజీ ఎంపీ జ్ఞానేంద్రరెడ్డి వర్గం నారాయణస్వామి అభ్యర్థిత్వాన్ని గట్టిగా వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలో నారాయణస్వామి కుమార్తె విజయానికి వైసీపీ అసమ్మతి వర్గం సహకరించే అవకాశాలు లేవు.

రోజాకు అసమ్మతి సెగ

నగరి నుంచి ఎమ్మెల్యే రోజా మూడోసారి పోటీ చేయనున్నారు. రోజా అభ్యర్థి అయితే కచ్చితంగా పనిచేసేది లేదని ఐదు మండలాల వ్యతిరేకవర్గ నాయకులు గట్టిగా చెప్పారు. రోజాతోపాటు ఆమె ఇద్దరు సోదరుల మీద అనేక అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. తనకు మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇప్పిస్తానని రూ.60 లక్షలు వసూలు చేసి పదవి, డబ్బులు ఇవ్వలేదని పుత్తూరుకు చెందిన కౌన్సిలర్ భువనేశ్వరి ఆరోపించిన విషయం తెలిసిందే. 2014, 2019 ఎన్నికల్లో రోజా నగరి నుంచి గెలిచినా. అతి తక్కువ మెజార్టీయే లభించింది. దీనికితోడు టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ఇంటింటి ప్రచారం పూర్తి చేశారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ దూసుకుపోతున్నారు.

వెంకటేగౌడకు అసమ్మతి బెడద

పలమనేరులో ఎమ్మెల్యే వెంకటేగౌడకే మళ్లీ టికెట్ దక్కింది. సీనియర్లను కలుపుకుని వెళ్లకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో కొందరు పార్టీకి దూరంగా ఉన్నారు. టికెట్ ఆశించిన జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు వర్గం ఈసారి ఎమ్మెల్యేకు పూర్తిస్థాయిలో సహకరించే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. దీనికి తోడు టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా ఇంటింటి ప్రచారం పూర్తి చేసి ముందంజలో ఉన్నారు.

చిత్తూరు



పూర్తి పేరు: ఎంసీ విజయానందరెడ్డి
పుట్టినతేదీ: 24.07.1969
విద్యార్హత: బీకాం
భార్య: ఇందుమతి
కుమారుడు: నిఖిలానందరెడ్డి
సొంతూరు: కొట్టార్లపల్లె, ఎస్ఆర్‌పురం మండలం
రాజకీయ నేపథ్యం: 2011 నుంచి వైసీపీలో కొనసాగుతున్నారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా పనిచేశారు.

పలమనేరు



పూర్తి పేరు: నల్లప్పగారి వెంకటేగౌడ
భార్య: పావని
పుట్టినతేదీ: 12.02.1986
పిల్లలు: ఇద్దరు
విద్యార్హత: బీఏ
వృత్తి: బెంగళూరులో స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారు.
రాజకీయ నేపథ్యం: 2014 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరి పోటీ చేసి గెలిచారు.

పూతలపట్టు



పూర్తి పేరు: ముదిరేవుల సునీల్ కుమార్
పుట్టినతేదీ: 01.09.1969
విద్యార్హత: ఎంబీబీఎస్
భార్య: మమతారాణి
పిల్లలు: కుమారుడు, కుమార్తె
రాజకీయ నేపథ్యం: 2014-19 మధ్యలో పూతలపట్టు వైసీపీ ఎమ్మెల్యేగా చేశారు

కుప్పం



పూర్తి పేరు: కృష్ణరాఘువ జయేంద్ర భరత్
పుట్టిన తేదీ: 13-11-1988
విద్యార్హత: బీటెక్
భార్య: దుర్గ పద్మిని
పిల్లలు: ఓ కుమార్తె
రాజకీయ నేపథ్యం: తండ్రి చంద్రమౌళి మరణించడంతో కుప్పం వైసీపీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. తొలిసారి అసెంబ్లీకి పోటీ చేయనున్నారు.

జీడీనెల్లూరు




పూర్తి పేరు: కళత్తూరు కృపాలక్ష్మి
వయసు: 44 ఏళ్లు
విద్యార్హత: ఫిజియోథెరఫీలో డిగ్రీ,ఇప్పుడు లా చదువుతున్నారు.
భర్త: అనిల్‌కుమార్, ఏపీ రీజనల్ హెడ్ ఆఫ్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్
పిల్లలు: కుమారుడు భువనతేజ, 9వ తరగతి
తండ్రి: నారాయణస్వామి, డిప్యూటీ సీఎం
తల్లి: పరంజ్యోతి, కార్వేటినగరం జడ్పీటీసీ
రాజకీయ నేపథ్యం: తండ్రి కోసం గతంలో పనిచేసినా తొలిసారి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు.

నగరి



పూర్తి పేరు: ఆర్కే రోజా
పుట్టిన తేదీ: 11.07.1972
భర్త: సెల్వమణి
కుమారుడు: కృష్ణ కౌశిక్
కుమార్తె: హన్షుమాలిక
విద్యార్హత: బీఎస్సీ
సొంతూరు: మూగలమర్రి, వాల్మీకిపురం మండలం
రాజకీయ నేపథ్యం: 1999లో టీడీపీ తరపున ప్రచారం చేశారు. 2004 ఎన్నికల్లో నగరి టీడీపీ నుంచి ఓటమి. 2009 ఎన్నికల్లో చంద్రగిరి టీడీపీ నుంచి ఓటమి. 2014, 2019 ఎన్నికల్లో నగరిలో వైసీపీ నుంచి గెలుపు. పర్యాటకశాఖ మంత్రిగా పనిచేశారు.

పుంగనూరు



పూర్తి పేరు: పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
పుట్టినతేదీ: 01.07.1952
విద్యార్హత: ఎంఏ పీహెచ్‌డీ
భార్య: స్వర్ణలత
కుమారుడు: మిథున్‌రెడ్డి, రాజంపేట ఎంపీ
కుమార్తె: శ్రీశక్తి
రాజకీయ నేపథ్యం: పీలేరు నుంచి మూడు సార్లు, పుంగనూరు నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పీలేరులో మూడుసార్లు ఓడిపోయారు. పదోసారి ఎమ్మెల్యేగా పోటీ చేయనున్నారు. రాజశేఖర్‌రెడ్డి క్యాబినెట్‌లో ఓ సారి, రోశయ్య క్యాబినెట్‌లో ఓసారి, జగన్ క్యాబినెట్‌లో మరోసారి మంత్రిగా పనిచేశారు.

చిత్తూరు (ఎంపీ)



పూర్తి పేరు: ఎన్.రెడ్డెప్ప, **పుట్టిన తేదీ:** 01.10.1951, **వృత్తి:** న్యాయవాది, **కుమారుడు:** దినేష్, **కుమార్తె:** హిమని, **విద్యార్హత:** ఎంఏ బీఎల్
రాజకీయ నేపథ్యం: 2019 ఎన్నికల్లో చిత్తూరు ఎంపీగా వైసీపీ తరపున పోటీ చేసి గెలిచారు. ఇప్పుడు రెండోసారి పోటీ చేయనున్నారు.

'కోడ్' కూసింది

● ఖర్చులు పెరిగిపోతాయని అభ్యర్థుల ఆందోళన
● ఏకపక్షంగా పనిచేసే అధికారులపై ఫిర్యాదులు







జడ్పీ వద్ద ఉన్న ఎన్టీఆర్, వైఎస్ విగ్రహాలకు వేసిన ముసుగు
- చిత్తూరు ఎమ్మెస్సార్ సర్కిల్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఇంకా పడని ముసుగు

చిత్తూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో అతిపెద్ద ప్రజాస్వామ్య పండుగకు నగారా మోగింది. దీంతో శనివారం నుంచే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చింది. పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఫలితాలొచ్చేవరకు పాటించాల్సి ఉంటుంది.

రిలాక్స్ అయిన అధికారులు

2019 ఎన్నికల తరహాలోనే ఈసారీ ఏప్రిల్‌లోనే పోలింగ్ ఉంటుందని అధికారులు భావించారు. అయితే పోలింగ్ మేలో ఉందని తెలియడంతో రిలాక్స్ అయ్యారు. 2019 సమయంలో పోలింగ్ జరిగాక ఓట్ల లెక్కింపునకు సుమారు నెలన్నర సమయం ఉండడంతో ఈవీఎంలకు ఎక్కువ రోజులు భద్రత ఇవ్వాల్సి వచ్చింది. ఈసారి పోలింగ్ జరిగిన 20 రోజుల్లోనే ఫలితాలు వెలువడనున్నాయి.

అభ్యర్థుల్లో ఆందోళన

మేలో పోలింగ్ అని తెలిశాక, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఆందోళన పెరిగిపోయింది. అదనంగా మరో నెలపాటు ఖర్చు ఉంటుందంటున్నారు. ఓసీ ఎమ్మెల్యే అభ్యర్థులకు రోజుకు కనీసం రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చవుతున్నట్లు సమాచారం. పోలింగ్ ఎన్నిరోజులు ఆలస్యమైతే అంత ఖర్చును భరించక తప్పదని అభ్యర్థులు అంటున్నారు.

నిష్పక్షపాతంగా పనిచేయని అధికారులకు ఇబ్బందే

ఇప్పటివరకు జిల్లాలో అధికారులు వైసీపీకి అనుకూలంగా పనిచేశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ముఖ్యంగా పోలీసు అధికారులైతే ప్రతిపక్షాల మీద అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టిన ఘటనలు చాలా ఉన్నాయన్న విమర్శలున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్రమ ఏకగ్రీవాలు చేసుకునేందుకు అన్ని స్థాయి అధికారులూ వైసీపీ వాళ్లకు సహకరించారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జిల్లాలో ఏకగ్రీవాలయ్యాయి. అలాగే పుంగనూరులో పోలీసులు సహా ఎన్నికలకు సంబంధించిన అధికారులు ఏకపక్షంగా పనిచేస్తున్నారని బలమైన ఆరోపణలున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు ఇకనైనా పర్యవేక్షించాల్సి ఉంది. లేకుంటే కిందిస్థాయి సిబ్బంది చేసే తప్పులకు ఉన్నతాధికారులు కూడా బలవ్వక తప్పదు. ఏకపక్షంగా పనిచేస్తున్నారనే అధికారులపై టీడీపీ నాయకులు ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఇటీవల చిత్తూరు మున్సిపల్ కమిషనర్ అరుణ మీద ఫిర్యాదు చేస్తే, ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. అలాగే జిల్లాలో ఎక్కువ కాలంగా పనిచేస్తున్న జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో శేషారెడ్డి, డ్వామా పీడీ రాజశేఖర్, మెప్మా పీడీ రాధమ్మలను బదిలీ చేయాలని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసి ఉన్నారు.

పార్టీల రంగులు, ఫ్లెక్సీల తొలగింపు

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రాజకీయ పార్టీల జెండా రంగులు, అభ్యర్థులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అధికారులు తొలగిస్తున్నారు. శనివారం నుంచి కోడ్ అమల్లోకి రాగా, చిత్తూరు నగరంలో ఫ్లెక్సీల తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం జిల్లా అంతటా మొదలవగా, ఎక్కడైనా మిగిలిన ఫ్లెక్సీలు, పార్టీ రంగులను ఆది, సోమవారాల్లో తొలగించక తప్పదు.

షెడ్యూల్ ఇలా..

నోటిఫికేషన్: ఏప్రిల్ 18 - **నామినేషన్ల గడువు:** ఏప్రిల్ 25 - **నామినేషన్ల పరిశీలన:** ఏప్రిల్ 26
ఉపసంహరణ: ఏప్రిల్ 29 - **పోలింగ్:** మే 13
ఓట్ల లెక్కింపు: జూన్ 4





సుద్దులకుప్పం క్రాస్‌లో సాయంత్రమైనా జరుగుతున్న శిలాఫలకం ఏర్పాటు పనులు - వి.కోటలో ప్రతిపక్ష జెండాలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది - దిగువ చెక్‌పోస్టులో తొలగించని వైసీపీ కటౌట్



శిలాఫలకాల కోసం తాపత్రయం

● ప్రతిపక్షాల జెండాలు, బ్యానర్లు, ఫెక్సీల తొలగింపు
● వైసీపీవి వదిలేసిన అధికారులు

వి.కోట,మార్చి16: కోడ్ అమల్లోకి వచ్చినా వి.కోట మండలం సుద్దులకుప్పం క్రాస్‌లో రోడ్డు పనులకు సంబంధించిన శిలాఫలకం ఏర్పాటు పనుల్లో సాయంత్రం వరకు అధికార పార్టీ నేతలు నిమగ్నం అయ్యారు. అలాగే పట్టణంలో పలు చోట్ల, మండల పరిధి కొన్ని గ్రామాల్లో గతంలో వేసిన సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ఎడాపెడా శిలాఫలకాలను ఏర్పాటు చేస్తూ వైసీపీ నేతలు తాపత్రయ పడటం కనిపించింది.

అధికారులిలా.. కోడ్ అమల్లోకి రావగానే పట్టణంలోని ప్రతిపక్ష పార్టీలకు చెందిన బ్యానర్లు, జెండాలు, ఫ్లెక్సీలను అధికారులు తమ సిబ్బందితో తొలగించారు. అయితే వైసీపీ నేతలకు చెందిన పెద్ద ఫ్లెక్సీలు, కటౌట్లను మాత్రం తొలగించలేదు. దీనిపై పలువురు ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. ఇకనైనా అధికారులు ఎన్నికల నియమావళిని సవ్యంగా అమలు చేయాలని కోరుతున్నారు.

వరసిద్ధుడి ఆలయంలో ప్రొటోకాల్ దర్శనాలు రద్దు

ఐరాల(కాణిపాకం), మార్చి 16: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధుడి ఆలయంలో ప్రొటోకాల్ దర్శనాలు రద్దు చేసినట్లు ఈవో వెంకటేశు తెలిపారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచే దీన్ని వర్తింపజేశామన్నారు. జూన్ ఆరో తేదీవరకు ప్రొటోకాల్ దర్శనాలు ఉండవని వివరించారు. ఈ సందర్భంగా వీఐపీ గేటు, పీఆర్వో కార్యాలయాన్ని పూర్తిగా మూసి వేస్తామన్నారు. ఉచితం, రూ.100, రూ.150 క్యూలైన్ల ద్వారానే స్వామి దర్శనానికి భక్తులను అనుమతిస్తారన్నారు. ఈ విషయాన్ని గమనించి.. అధికారులకు అందరూ సహకరించాలని కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుందాం

● టీడీపీ, బీజేపీ, జనసేన

చిత్తూరు (సెంట్రల్), మార్చి 16: మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని బీజేపీ, టీడీపీ జిల్లా అధ్యక్షులు జగదీశ్వర్‌నాయుడు, పులివర్తి నాని, జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆరణి కవిత పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడి అధ్యక్షతన చిత్తూరు, పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థులు గురజాల జగన్మోహన్, మురళీమోహన్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి, సీకేబాబు, ఏఎస్ మనోహర్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, మాజీ మేయర్ కఠారి అనురాధ, బీజేపీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజన్‌లతోకలిసి మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. 2014-19 మధ్య పొత్తులతో అధికారంలోకి వచ్చిన టీడీపీ రాష్ట్రంలో ఎనలేని అభివృద్ధి చేసిందన్నారు. ఆ తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రజావేదిక కూల్చివేతతో పాలన ప్రారంభించి, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. ప్రస్తుతం బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తుతో వైసీపీలో ఓటమి భయం పట్టుకుందన్నారు. ఇటు రాష్ట్రంలోనూ, అటు జిల్లాలోను అభివృద్ధి జరగాలంటే ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. చిత్తూరు అభ్యర్థి జగన్మోహన్ మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. పూతలపట్టు అభ్యర్థి మురళీమోహన్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం) : సా. 6.29
సహరి (సోమవారం) : ఉ. 4.59

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పలమనేరులో పాతకాపుల మధ్యనే పోటీ


అమరనాథరెడ్డి


వెంకటేగౌడ

పలమనేరు, మార్చి16 : పలమనేరులో మళ్లీ పాతకాపులే తలపడుతున్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి అమరనాథరెడ్డి, వైసీపీ అభ్యర్థిగా వెంకటేగౌడ, జనసేన తరపున శ్రీకాంత్‌నాయుడు, కాంగ్రెస్ తరపున పార్థసారథిరెడ్డి, బీజేపీ తరపున ఈశ్వరరెడ్డి, ప్రజాశాంతి పార్టీ తరపున ఎన్. వెంకటరమణ, వీసీకే పార్టీ తరపున ఎన్. శ్రీనివాసులు, ఇండిపెండెంట్ అభ్యర్థులు మొత్తం 11 మంది బరిలో దిగినా ప్రధాన పోటీ మాత్రం టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్యనే జరిగింది. ఈసారి బీజేపీ, జనసేన మద్యపొత్తుతో అమరనాథరెడ్డి ఉమ్మడి అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ నుంచి పోటీలోకి దిగుతున్నారు. గత ఎన్నికల్లో జనసేన అభ్యర్థి శ్రీకాంత్‌నాయుడికి 4254 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి ఈశ్వరరెడ్డికి 1148 ఓట్లు లభించాయి. నియోజకవర్గ చరిత్ర పరిశీలిస్తే ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు వరుసగా రెండోసారి పోటీకి దిగడం ఇదే ప్రథమం. ఈ నియోజకవర్గంలో డాక్టర్ పట్నంసుబ్బయ్య మినహా ఒకే పార్టీనుంచి పోటీచేసి రెండోసారి ఎమ్మెల్యేగా ఎవరూ ఎన్నిక కాలేదు. పట్నం సుబ్బయ్య మాత్రం టీడీపీ అభ్యర్థిగా పలమనేరు నియోజగకవర్గంనుంచి వరుసగా 1985,1989,1994 ఎన్నికల్లో విజయం సాధించి రికార్డు సృష్టించారు.

'కోడ్' రాగానే విగ్రహాలకు ముసుగులు


కల్లూరులో వైఎస్సార్ విగ్రహానికి ముసుగు


సోమలలో హోర్డింగులు తొలగింపు

సోమల, మార్చి16: స్థానిక బస్టాండ్‌లోని వైఎస్సార్ విగ్రహానికి ముసుగులు వేశారు. పలు చోట్ల పార్టీల గోడపత్రికను పంచాయతీ సిబ్బంది తొలగించారు. సచివాలయాల్లోని సీఎం చిత్రపటాలన తీసివేశారు. ఎంపీడీవో నారాయణ, ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, కార్యదర్శులతో కలసి ఎన్నిల కోడ్ అమలుకు శ్రీకారం చుట్టారు.

పలమనేరు: ఎన్నికల కోడ్ రాగానే పలమనేరులో శనివారం సాయంత్రం సచివాలయాల సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు ఏర్పాటు చేశారు. అంతేకాక పట్టణంలో ఏర్పాటు చేసిన రాజకీయ ప్లెక్సీలు, జెండాలను కూడా తొలగించారు.

కల్లూరు : కల్లూరులోని వైఎస్సార్ విగ్రహానికి పంచాయతీ కార్యదర్శి యుగంధర్ ముసుగు వేయించారు. రాజకీయ పార్టీల ప్లెక్సీలు తొలగించారు.

పుంగనూరు : స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, మాజీ ఎంపీ రామకృష్ణారెడ్డి, అంబేడ్కర్ సర్కిల్ వద్ద మాజీ ఎంపీ ఆదికేశవులు, ప్రైవేటు బస్టాండ్‌లోని మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు మున్సిపల్ అధికారులు ముసుగులు వేయించారు.

బెగ్గిలపల్లెలో టీడీపీ ఇంటింటా ప్రచారం

గుడుపల్లె, మార్చి 16: మండలంలోని బెగ్గిలపల్లెలో టీడీపీ శ్రేణులు శనివారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో అరాచకాలు, దోపిడీతో ప్రజలు ఎంతగానో విసిగిపోయారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో చంద్ర బాబుకు లక్ష మెజారిటీ సాధనకు అందరు కృషి చేయాలన్నారు. ఇంటింటా తిరిగి కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బాబు నాయుడు, నేతలు చంద్రశేఖర్, మునిరాజు, హేమాంబర్ గౌడు, జనసేన మండలాధ్యక్షులు అమీర్, నారాయణమూర్తి, గంగాధర్, ఎల్లప్ప, శ్రీనివాసులు, పద్మమ్మ, మునస్వామి, రమేష్, రామచంద్ర, ప్రకాష్, నారాయణ, రమేష్, వెంకటేశ్, ఎల్లప్ప, సుబ్బు, మంజునాథ్, భానుమూర్తి పాల్గొన్నారు.

'గతం గుర్తుచేసుకుంటు'న్న పెద్దాయన!


వానగుట్టపల్లె ప్రచారంలో మహిళలతో పీఎస్.మునిరత్నం

కుప్పం, మార్చి 16: టీడీపీ శ్రేణులకు ఆయన పెద్దాయన. మంచిచెడూ చెప్పే ఇంటి మనిషిలాంటి వారు. సాక్షాత్తు చంద్రబాబుకు పీజీలో క్లాస్ మేట్ కూడా. ఆయనే కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం. పీఎస్ఎం అని అభిమానులు, పార్టీ శ్రేణులు అభిమానంగా పిలుచుకునే ఆ పెద్దాయన కొంతకాలంగా పల్లెల బాట పడుతున్నారు. చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించుకోవాల్సిన అవశ్యకతను గ్రామీణులకు విప్పి చెబుతున్నారు. 'గతం గుర్తు చేసుకుందాం - బాబు రుణం తీర్చుకుందాం' పేరుమీద జరుగుతున్న ఎన్నికల ప్రచార కార్యక్రమం ఆయన ఉన్న చోట నిజంగానే గతాన్ని ఆవిష్కరిస్తోంది. చంద్రబాబు రాకముందు అంటే 1989కి పూర్వం కుప్పం నియోజకవర్గం ఎలాఉందో, ఆయన ఎమ్మెల్యే అయి, ఆపైన 14 ఏళ్ల ముఖ్యమంత్రిత్వంలో ఎలా వెలిగిపోయిందో విడమరచి చెబుతున్నారు. ఈతరానికి అర్థమయ్యేలా వివరిస్తున్నారు. హడావుడి లేకుండా పీఎస్ఎం ప్రచారం ప్రశాంతంగా పల్లెల్లో సాగిపోతోంది. శనివారంనాడు ఆయన కుప్పం మండలంలోని కంగుంది, వానగుట్టపల్లె, మిట్టపల్లె గ్రామాల్లో పర్యటించారు.

పీఈఎస్‌లో అత్యవసర విపత్తుపై అవగాహన



కుప్పం, మార్చి 16: కుప్పంలోని పీఈఎస్ ఆసుపత్రిలో శుక్ర, శనివారం అత్యవసర సమయాలలో నిర్వహించాల్సిన ప్రమాద నివారణ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంటల వలన కలుగు ప్రమాదాలు, రసాయనాల వలన కలుగు ప్రమాదాలు, చిన్నపిల్లలను దొంగిలించుకు పోవడం, ఆసుపత్రి లోపల, బయట జరిగే కొట్లాటలలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్, సేఫ్టీ ఆఫీసర్ ఆర్ముగం నాయక్ ఆధ్వర్యంలో సిబ్బందికి ప్రయోగాత్మకంగా అవగాహన కలిగించారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంటు డాక్టర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రమాద నివారణ పద్ధతులపై అవగాహన కలిగి ఉండడంవల్ల ఆసుపత్రిలో రోగులకు మరింత భద్రత లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది, క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిబ్బంది, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో పొట్టి శ్రీరాములు జయంతి



పలమనేరు, మార్చి 16 : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం పలమనేరు ఎద్దుల సంత వీధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం యోగా గురువు నందగోపాల్, సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు చిన్నపిల్లల చేత దేశభక్తి గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ శాంతి, హెల్పర్ విజయ పాల్గొన్నారు.

పుంగనూరు : పొట్టిశ్రీరాములు జయంతిని పుంగనూరులో ఆర్యవైశ్య సంఘసభ్యులు ఘనంగా నిర్వహించారు. శనివారం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కందూరులో టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

సోమల: కందూరు హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు వీడ్కోల్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు రంగవల్లులు వేసి సరస్వతిదేవికి పూజలు జరిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకట్రమణారెడ్డి, షకీల్, వాసు, శివరాజ, హరినారాయణ పాల్గొన్నారు.

విధ్వంసకర పాలన నుంచి త్వరలో విముక్తి : అమర్

పలమనేరు, మార్చి16 : జగన్ ఐదేళ్ల విధ్వంసకర రాక్షస పాలన నుంచి ప్రజలకు త్వరలో విముక్తి లభించనుందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన పలమనేరులో మీడియా సమావేశంలో మాట్లాడుతూ మరో 45రోజుల్లో రాష్ట్రానికి పూర్తి స్వేచ్ఛ లభించనుందన్నారు. గత ఐదేళ్లలో జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అతలాకుతలం చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన 28 పథకాలు, బీసీలకు చెందిన 30 పథకాలు, మైనారిటీలకు చెందిన 11 పథకాలను రద్దుచేసి వందలాది మందిపై మారణహోమం సృష్టించిన జగన్ పాలనకు ముగింపు పలికే సమయం అసన్నమైందన్నారు. ఐదేళ్లలో మ్యానిఫెస్టోలో 30 శాతం హామీలను కూడా అమలు చేయకుండా అన్ని వర్గాల వారిని వంచించిన జగన్‌ను శాశ్వతంగా ఇంటికి పరిమితం చేయడం ఖాయమన్నారు. జగన్ రెడ్డికి ఓటు వేయవద్దని రక్తం పంచుకుని పుట్టిన చెల్లెలే చెబుతున్నారంటే రాష్ట్రంలో పరిస్థితి ఎంత దారుణంగా వుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ దఫా జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు ముక్కలు కావడం ఖాయమని, తాడేపల్లి ప్యాలెస్ నుంచే కాదు ఈ రాష్ట్రంనుంచి తరిమి కొట్టే రోజు దగ్గరలోనే వుందన్నారు.

వి.కోట : తోబుట్టువు షర్మిల, తండ్రి హత్య కేసు నిగ్గు తేల్చాలని న్యాయ పోరాటం చేస్తున్న మరో చెల్లి సునీతరెడ్డిలకు న్యాయం చేయలేని జగన్ రెడ్డి... ఇక రాష్ట్ర ప్రజలకు ఏం ఒరగబెడుతారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం చింతమాకుపపల్లె పంచాయతీ కె.గొల్లపల్లెలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలుచేసే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు కదిలారు. ఆయన మాట్లాడుతూ పట్టిసీమ ప్రాజెక్టును పూర్తి చేయకుండా హంద్రీ-నీవాకు నీరిచ్చామంటే ప్రజలెలా నమ్ముతారన్నారు. వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలన్నారు.


కె.గొల్లపల్లెలో ఓటరును అభ్యర్థిస్తున్న అమరనాథరెడ్డి

కాంచిమిట్టపల్లెలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

చింతమాకులపల్లెకు చెందిన వైసీపీ నేత సీ.ఎం.నవీన్‌రెడ్డి నేతృత్వంలో శనివారం కాంచిమిట్టపల్లెలో సుమారు 15 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి వారికి పసుపు కండువాలు కప్పి సోమశేఖర్, సుధాకర్, ఠాగూర్, నాగేంద్ర, లక్ష్మీపతి, సతీష్, హరికృష్ణ, ఉదయ్, జనార్ధన్, రాజశేఖర్, పవన్, నవీన్, పద్మనాభన్ తదితరులను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, నేతలు రాంబాబు, చౌడప్ప, సోమశేఖర్, ఓబుల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గంలో పలు కేసుల పరిష్కారం


కుప్పం లోక్ అదాలత్‌లో కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి

కుప్పం, మార్చి 13: కుప్పం కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కుప్పం జూనియర్ సివిల్ జడ్జి ఆరీఫా షేక్ అధ్యక్షతన జరిగిన ఈ అదాలత్‌లో రూ.12,13,587 విలువైన 11 సివిల్ కేసులు, రూ.94.69 లక్షలు విలువైన క్రిమినల్ కేసులు, రూ.9,66,600 విలువైన బ్యాంక్ పీఎల్సీ కేసుల్లో కక్షిదారుల మధ్య రాజీ ద్వారా పరిష్కారం అయినట్లు జడ్జి తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో కుప్పం అడిషనల్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సి.విశ్వనాథ్‌రెడ్డి, కార్యదర్శి వి.హరికృష్ణ, బెంచ్ సభ్యులు వీఎస్. శైలశ్రీ, ఆర్.అనిల్‌కుమార్, సీనియర్, జూనియర్ అడ్వకేట్లు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరులో 63కేసుల పరిష్కారం

పుంగనూరు : జాతీయ లోక్‌అదాలత్‌లో 63కేసులు పరిష్కారం జరిగినట్లు సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవరావు తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జరిగిన లోక్ అదాలత్‌లో సివిల్ 15 కేసులు, క్రిమినల్ కేసులు 48 పరిష్కారించినట్లు తెలిపారు. ఇందులో కక్షిదారులకు రు.72లక్షలు ఇప్పించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జీ కార్తీక్, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు శివశంకర్‌నాయుడు, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

పలమనేరులో 67 కేసుల పరిష్కారం

పలమనేరు : పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జరిగిన లోక్ అదాలత్‌లో మొత్తం 67 కేసులను సీనియర్ సివిల్‌జడ్జి పి.శ్రీనివాసరావు పరిష్కరించారు. ఇందులో 5 సివిల్ కేసులు, 49 క్రిమినల్ కేసులు, 13 బ్యాంకు కేసులు పరిష్కారమయ్యాయి. వీటి విలువ సుమారు రూ. 98,83,677 వుంటుందని కోర్టు సిబ్బందితెలిపారు. డీఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐ చంద్రశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.లక్ష్మీపతి, న్యాయవాదులు, స్టేట్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు లమేనేజర్లు, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

టీడీపీ గెలిపిద్దాం.. అభివృద్ధి సాధిద్దాం : చల్లా

కల్లూరు, మార్చి 16: అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడపాలంటే టీడీపీని గెలిపించుకోవాలని పుంగనూరు ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం అయ్యావాండ్లపల్లి, ఎర్రపాపిరెడ్డిగారిపల్లి, దిగువపోకలవారిపల్లి పంచాయతీలలో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమానికి చల్లా రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ముందుగా పెద్దబెస్తపల్లికి విచ్చేసిన చల్లాబాబుకు తెలుగు మహిళలు 109 గుమ్మడికాయలతో దిష్టి తీసి కొబ్బరికాయలు కొట్టి గజమాలతో సన్మానించారు. అనంతరం గేటుకాడ బెస్తపల్లికి చేరుకోగా గ్రామస్థులు చల్లాబాబును గజమాలతో సత్కరించారు. ఆపై వెళ్లిన ఎర్రపాపిరెడ్డిగారిపల్లి, కురవపల్లి, దిగువపోకలవారిపల్లి, జ్యోతినగర్, అయ్యావాండ్లపల్లి, ఎర్రంవాండ్లపల్లి పర్యటనలో చల్లాకు అపూర్వ స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీని గెలిపించి ఒక్క అవకాశం ఇస్తే మీ రుణం తీర్చుకుంటానన్నారు. కురవపల్లి, దిగువపోకలవారిపల్లిలో వైసీపీకి చెందిన యర్రయ్య, నారాయణ, శ్రీనివాసులు, సుధాకర్‌రాజు, ప్రభాకర్‌రాజు తదితరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చల్లా బాబురెడ్డికి గుమ్మడికాయలతో దిష్టితీస్తున్న మహిళలు

టీడీపీ హయాంలో వడ్డెర్లకు పెద్దపీట


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాధవన్

కుప్పం, మార్చి 16: తెలుగుదేశం పార్టీ హయాంలో చంద్రబాబు వడ్డెర కులస్థులకు పెద్ద పీట వేశారని కుప్పం నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షుడు మాధవన్ అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడ్డెర్లను వైసీపీ విభజించు, పాలించు అన్న పద్ధతిలో తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకుంటోందని విమర్శించారు. వడ్డెర కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది చంద్రబాబేనన్నారు. శాంతిపురం మండలం పోడూరు వద్ద వడ్డెర కమ్యూనిటీ భవన నిర్మాణానికిగాను 2 ఎకరాల స్థలాన్ని కేటాయించిన విషయం గుర్తు చేశారు. వైసీపీ పాలనలో తమ కుల కార్పొరేషన్ ఛైర్మన్, సభ్యులకు కనీస వేతనాలు అందించలేదని విమర్శించారు. ఆ పార్టీ వకాల్తా పుచ్చుకుంటున్న కొందరు కులస్తులు వారి పాలనలో వడ్డెర్లకు జరిగిన అన్యాయాలను ఎందుకు ప్రశ్నించడంలేదని నిలదీశారు. కుప్పం నియోజకవర్గంలోని 90 శాతం వడ్డెర్లు ప్రస్తుతం పనులు లేక ఇతర రాష్ట్రాలకు ఉపాధికోసం వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలిచి తీరుతుందని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక వడ్డెర్ల అన్ని సమస్యలు తీరిపోతాయని ఆయన స్పష్టం చేశారు. వడ్డెర కులస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆదా చేయడానికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ ఈఈ శ్రీనివాసమూర్తి

పుంగనూరు రూరల్, మార్చి16: విద్యుత్ ఆదా చేయడానికి టెక్నీషియన్లు సహరించాలని విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసమూర్తి కోరారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రైవేటు టెక్నీషియన్లకు విద్యుత్ ఆదాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి విద్యుత్‌మోటర్లు ఏర్పాటు చేసే సమయంలో రైతులు తక్కువ హార్స్ పవర్ ఉన్న మోటర్లు ఏర్పాటు చేసుకునేలా వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని కోరారు. ఏడీఈ రవి, ఏఈ శశిధర్ పాల్గొన్నారు.

కుప్పం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వాసుదేవరెడ్డి

కుప్పం, మార్చి 16: కుప్పంలోని ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎం.వాసుదేవరెడ్డి నియమితులయ్యారు. చిత్తూరులోని ప్రభుత్వ వృత్తివిద్యా జూనియర్ కళాశాల అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఆయన, పదోన్నతిపై ఈ కళాశాలకు వచ్చారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. పూర్వ ప్రిన్సిపాల్ సరిత బాధ్యతలు అప్పగించారు.

రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనే : టీడీపీ

శాంతిపురం, మార్చి 16 : రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే నారా చంద్రబాబుతోనే సాధ్యపడుతుందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ్‌నాయుడు అన్నారు. శనివారం మండల పరిధిలోని నడింపల్లె, రంగేపల్లె గ్రామాల్లో టీడీపీ నేతలతో కలిసి వారు ఇంటింటా బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో అభివృద్ధి జాడలేదన్నారు. టీడీపీ నేతలు చంద్రశేఖర్, విజయరామిరెడ్డి, బాలకృష్ణ, నారాయణస్వామి, మణి, గోపాల్, పెద్దన్న, ఎల్.జయరామిరెడ్డి, రుద్రప్ప, ఆంజనేయరెడ్డి, నారాయణరెడ్డి, చలపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● డీఈవో శ్రీరామ పురుషోత్తం


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో

సదుం, మార్చి 16: ఈనెల 18వతేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డిపార్టుమెంట్ చీఫ్ అధికారులకు డీఈవో శ్రీరామ పురుషోత్తం ఆదేశించారు. పదవ తరగతి పరీక్షా కేంద్రమైన సదుం జడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల ఏర్పాటుపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. అలాగే మధ్యాహ్న భోజన నాణ్యత, మెనూను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీరాములు, దామోదర, జిల్లా ఏఎల్ఎస్‌వో అజయ్ కుమార్ రెడ్డి, హెచ్ఎం విజయకుమార్ రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు మోహన్ కుమార్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కుప్పంలో టీడీపీ శ్రేణుల సంబరాలు

కుప్పం, మార్చి 16: ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో కుప్పంలో టీడీపీ శ్రేణులు శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయం ఎదుట సంబరాలు జరుపుకొన్నాయి. బాణాసంచా కాలుస్తూ 'బై బై జగన్' అని నినాదాలు చేశారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ ప్రజలు ఇక నిర్భయంగా ఎన్నికల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మే 13న జరుగనున్న ఎన్నికల్లో టీడీపీకి ఘన విజయం అందించడం ద్వారా రాష్ట్ర ప్రజలు చరిత్ర సృష్టించబోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, టీడీపీ కుప్పం మున్సిపల్, రూరల్ మండల అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చల్లాను కలసిన టీడీపీ నాయకులు

చౌడేపల్లె, మార్చి16 : పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని చౌడేపల్లెకు చెందిన టీడీపీ నాయకులు శనివారం కలిశారు. పులిచర్ల మండల పర్యటనలో ఉన్న ఆయనను చౌడేపల్లె మండల పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులు కలసి ఆయనను శాలువాలతో సన్మానించారు. నాయకులు జంపాల శ్రీనివాసులు నాయుడు, గిరిరాజు, వెంకటరమణ, హరిప్రసాద్, ఆది, బాబునాయుడు, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి నలగుండ్రాయ స్వామి బ్రహ్మోత్సవాలు

బైరెడ్డిపల్లె, మార్చి 18 : కడపనత్తంలో ఉన్న నలగుండ్రాయస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి 30వతేది వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త మురళి, కమిటీ సభ్యులు తెలిపారు. 18న అంకురార్పణం, ధ్వజారోహణం, 19న కలశారాధన, సూర్యప్రభ వాహనం, చంద్రప్రభవాహనం, 20న సింహవాహనం, 21న హనుమంత వాహనం, 22న శేషవాహనం, 23న శ్రీవారి కల్యాణోత్సవం, 24న గరుడోత్సవం, గజవాహనం, 25న రథోత్సవం, 26న దోపోత్సవం, పుష్పయాగోత్సవం, 27న శయనోత్సవం, 28న శ్రీకృష్ణావతార ఉత్సవం, 29న హంసవాహనం, 30న పుష్పపల్లకీ సేవ జరుగుతుందన్నారు.

కంటి పరీక్ష శిబిరం విజయవంతం

కుప్పం, మార్చి 16: పీఈఎస్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, పీఈఎస్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 120 మంది వైద్య సేవలు పొందారని, వారిలో 18 మందిని కంటి ఆపరేషన్ల కోసం సిఫార్సు చేశామని లయన్స్ క్లబ్ రీజనల్ ఛైర్మన్ ఎ.మహేశ్ తెలిపారు. లయన్స్ క్లబ్ కుప్పం అధ్యక్షుడు సత్యేంద్రశేఖర్, సభ్యులు చరణ్, కృష్ణమూర్తి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫెడరల్ బ్యాంక్ బ్రాంచ్-2 ప్రారంభం

పలమనేరు, మార్చి16 : పలమనేరు నియోజకవర్గంలో ఫెడరల్ బ్యాంకు తన రెండవ బ్రాంచ్‌ను గంగవరం మండలం గండ్రాజుపల్లిలో శనివారం ప్రారంభించింది. ఇప్పటికే పలమనేరులో ఫెడరల్ బ్యాంక్ బ్రాంచ్‌ను కొద్దినెలల క్రితమే ప్రారంభించారు. మహిళా పారిశ్రామిక వేత్త ఎ. మైథిలి, పారిశ్రామిక వేత్త రిషబ్ ప్రభాకర్, ఫెడరల్ బ్యాంక్ తిరుపతి క్లస్టర్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ స్వాతి ప్రియ, బ్రాంచ్ హెడ్ నాగేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాతిప్రియ మాట్లాడుతూ జాతీయ బ్యాంకులు అందించే సేవలన్నీ ఫెడరల్ బ్యాంకు అందిస్తుందన్నారు.

ఆవులపల్లెలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు



సోమల, మార్చి16: ఆవులపల్లెలో కొలువు తీరిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు చేసి అర్చనలు, అభిషేక పూజలు జరిపారు. కలశపూజలు, హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

టీఎం గొల్లపల్లెలో అగ్ని ప్రమాదం

సోమల, మార్చి 16: పెద్దఉప్పరపల్లె పంచాయతీ టీఎం గొల్లపల్లెలోని మంజుల గుడిసెలో శనివారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి రూ.3 లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు తెలిపారు. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు ఫిర్యాదు చేసింది. మంజుల భర్త పొరుగూరుకు వెళ్లడంతో ఒంటరిగా మరో ఇంట నిద్రించింది. అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించి ఫలితం లేక పోయింది. ఈక్రమంలోనే ఇంటిలోని రూ. 52 వేలు నగదు, 20 గ్రాముల బంగారు, వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. వీఆర్వో శ్రీరాములు సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు.

మామిడి, నీలగిరి తోటలకు నిప్పు

పుంగనూరు రూరల్, మార్చి16: బైనిగానిపల్లె సమీపంలోని మామిడి, నీలగిరి తోటలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు తెలిపారు. శనివారం మధ్యాహ్నం తోటలు కాలుతున్నట్లు రైతుల అందించిన సమాచారం మేరకు తన సిబ్బందితో చేరుకుని మంటలు అదుపు చేసినట్లు ఆయన తెలిపారు.

మోదుగులపల్లెలో కాంగ్రెస్ ప్రచారం

పుంగనూరు రూరల్, మార్చి16: మండలంలోని మోదుగులపల్లె పంచాయతీలో శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదలకు అందించే పథకాలను వివరించారు. కార్యక్రమంలో శ్రీదేవి, మంకునాయక్, మోసేన, మసీద్‌బాషా, బుడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

పుంగనూరు రూరల్, మార్చి16: ఓటు హక్కు వినియోగంపై శనివారం మహిళా సంఘాలు స్త్రీశక్తి భవన్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ చేశారు ఏపీఎం రవి మాట్లాడుతూ ఓటర్‌గా నమోదు చేసుకోవడంతో పాటు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సీసీలు, సంఘమిత్రాలు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం సీజ్

పుంగనూరు రూరల్, మార్చి16: కర్ణాటక మద్యం సీజ్ చేసి ఒకరిని అరెస్ట్ చేసినట్లు సీఐ రాఘవరెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని తూర్పుమొగసాలకు చెందిన మురళి కర్ణాటక మద్యం విక్రయిస్తూ పట్టుబడినట్లు ఆయన తెలిపారు. మురళిని అదుపులోకి తీసుకోగా అతని వద్ద 78 టెట్రాప్యాకెట్లు లభించడంతో సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థి అదృశ్యం

పుంగనూరు రూరల్, మార్చి16: విద్యార్థి అదృశ్యం కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ వెంకట్రమణ తెలిపారు. చంద్రమాకులపల్లె పంచాయతీ ఒంటిమిట్టకు చెందిన భాస్కర్ కుమార్తె అమృత మదనపల్లెలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువున్నట్లు తెలిపారు. అమృత ఈనెల 14న కాలేజీకి వెళుతున్నట్లు ఇంటిలో చెప్పి వెళ్లి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో బందువులు, స్నేహితుల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో తండ్రి భాస్కర్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

20 నుంచి కుంభాభిషేక ఉత్సవాలు

బైరెడ్డిపల్లె, మార్చి 20 : పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో నూతనంగా నిర్మించిన మహాగణపతి ఆలయ కుంభాభిషేక ఉత్సవాలు ఈనెల 20 నుంచి 22వ తేది వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 20న గణపతి పూజ, అంకురార్పణం, 21న పూర్ణాహుతి, మహాగణపతి అభిషేకం, 22న నూతన విగ్రహప్రతిష్ఠ, కుంభాభిషేకం జరుగుతుందన్నారు.

నల్ల బెల్లం నిల్వ ఉంచిన వ్యక్తి అరెస్టు

పెద్దపంజాణి, మార్చి 16: రాయలపేట పంచాయతీ చిలకపుత్తూరుకు చెందిన మల్లికార్జున దుకాణంలో శుక్రవారం తనిఖీ నిర్వహించి నల్ల బెల్లాన్ని కనుగొన్నామని గంగవరం సీఐ కృష్ణమోహన్ తెలిపారు. దాదాపు 3టన్నుల నల్ల బెల్లంతోపాటు 20 లీటర్ల నాటుసారాను సీజ్‌చేశామన్నారు. శనివారం మల్లికార్జున ను అరెస్టు చేసి కేసు నమోదు చేసి పుంగనూరు కోర్టులో హాజరుపరిచామన్నారు. నాటు సారా విక్రయించే ఇద్దరు పరారీలో ఉన్నారని, వారిని త్వరలో అరెస్టు చేసి రిమాండుకు పంపిస్తామన్నారు.

పెద్దపంజాణి: గంకొండపాళ్యంలో సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. రాజన్న అనే వ్యక్తి అక్రమంగా నాటుసారా విక్రయిస్తుండగా అరెస్టుచేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించామన్నారు.

లోక్ అదాలత్ కక్షిదారులకు వరం

చిత్తూరు లీగల్, మార్చి 16: కక్షిదారులకు లోక్ అదాలత్ కార్యక్రమం ఓ వరం వంటిదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు అన్నారు. శనివారం ఎస్టేట్‌లో ఉన్న జిల్లా కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు విభేదాలను పక్కనపెట్టి సోదరభావంతో మెలగాలన్నారు. డీఎల్ఎస్ఏ సెక్రటరీ కరుణకుమార్, సీనియర్ న్యాయవాది అశోక్ ఆనంద్ యాదవ్‌తో పాటు పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.



కక్షిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న డీజే భీమారావు

1074 కేసుల పరిష్కారం

శనివారం ఉమ్మడి జిల్లాలో జరిగిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా 1,074 కేసులు పరిష్కారమయ్యాయి. వాయల్పాడులో 24, తిరుపతిలో 267, తంబళ్లపల్లెలో 4, శ్రీకాళహస్తిలో 62, సత్యవేడులో 52, పుత్తూరులో 103, పుంగనూరులో 62, పీలేరులో 38, పలమనేరులో 51, పాకాలలో 27, నగరిలో 33, మదనపల్లెలో 49, కుప్పంలో 67, చిత్తూరులో 235 కేసులు పరిష్కారమయ్యాయి.

ఎన్నికల నియమావళిపై అవగాహన ఉండాలి

చిత్తూరు (సెంట్రల్), మార్చి 16: ఎన్నికల నియమావళిపై పీవోలు, ఏపీవోలు అవగాహన కల్గి ఉండాలని డ్వామా ఏపీడీ చిన్నరెడ్డన్న, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి సూచించారు. శనివారం డీఆర్వో చిన్నయ్య, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, జడ్పీ సమావేశ మందిరంలో నాల్గవ రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం ఈవీఎంలు ఎలా వినియోగించాలన్న దానిపై అవగాహన కల్పించారు. డిప్యూటీ కలెక్టర్ శివయ్య, బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బానీ, ఏపీడీ ఉమాదేవి, మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ సౌందర్‌రాజన్, ఉమమహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలపై శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్లు

పేటమిట్టలో 'ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్'

పూతలపట్టు, మార్చి 16: పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామాన్ని ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ సంస్థ మహిళలు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అమరరాజా సంస్థల వ్యవస్థాపకుడు గల్లా రామచంద్ర నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పేటమిట్టలో రామచంద్రనాయుడు చేసిన అభివృద్ధి పనులను పరిశీలించి, సంతోషం వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్, అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి, సభ్యులు శశిబిందు, శ్రీదేవి, సరిత, అనుపమ, కోమల, సులోచన తదితరులు పాల్గొన్నారు.



గల్లా రామచంద్రనాయుడిని సన్మానిస్తున్న ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ సంస్థ మహిళలు

నేటి గ్రూప్-1 పరీక్షలకు సర్వం సిద్ధం: కలెక్టర్

చిత్తూరు (సెంట్రల్), మార్చి 16: జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న ఏపీపీఎస్‌ఈ గ్రూప్-1 పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. 2,517 మంది అభ్యర్థుల కోసం ఎస్వీసెట్, సీతమ్స్, పీవీకేఎన్ ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థుల సందేహాలు నివృత్తికి కలెక్టరేట్‌లో 94910 77356 నెంబరుతో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలోనూ అన్ని వసతులు కల్పించామన్నారు. నిర్దేశించిన సమయానికి నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని అభ్యర్థులు గుర్తుంచుకోవాలని సూచించారు.

రేపటినుంచి టెన్త్ పరీక్షలు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 16: జిల్లాలో సోమవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. 22594 మంది పరీక్షలు రాయనున్నారన్నారు. వీరిలో.. 22119 మంది రెగ్యులర్, 1395 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. వీరికోసం 116 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 11 రూట్లు ద్వారా 33 స్టోరేజ్ పాయింట్లకు ఇప్పటికే ప్రశ్నపత్రాలు తరలించి, భద్రపరిచామని వివరించారు. ఆరు సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిర్దేశించిన సమయానికి గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయవచ్చన్నారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు తలెత్తితే డీఈవో కార్యాలయంలో 90321 85001 నెంబరుతో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలన్నారు.

తిరుపతి జేసీగా ధ్యానచంద్ర

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 16 : జాయింట్ కలెక్టర్‌గా ధ్యానచంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. ఇక్కడ జేసీగా పని చేస్తున్న శుభం బన్సల్ శాప్ ఎండీగా బదిలీ అయిన విషయం విదితమే. ధాన్యచంద్రకు ఆర్డీవో పెంచలకిషోర్, ఎస్డీసీ భాస్కర్‌నాయుడు, సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని, కలెక్టరేట్ ఏవో నరసింహారావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



వామ్మో ఎంత పెద్ద పామో

తిరుమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అలిపిరి నడక మార్గంలో నాగుపాము భక్తులను బెంబేలెత్తించింది. సుమారు ఆరడుగుల పాము 3,300 మెట్ల వద్దకు వచ్చింది. దాన్ని చూసిన భక్తులు భయంతో కేకలు వేస్తూ, పరుగులు తీశారు. కొంత సమయానికి అది దగ్గర్లో సేపాల్ భద్రతా సిబ్బంది బస చేసే షెడ్ లోపలికి ప్రవేశించింది. వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని దాన్ని పట్టుకుని అవ్వాచారి కోనలో వదిలేశారు.



పట్టుబడిన నాగుపాము

ఏడీఎంఈలుగా ఇద్దరికి పదోన్నతులు

తిరుపతి(వైద్యం), మార్చి 16 : వైద్య విద్యా, కుటుంబ సంక్షేమ శాఖలో ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న ఇద్దరికి అదనపు వైద్య విద్యా సంచాలకులు(ఏడీఎంఈ)గా పదోన్నతి ఇస్తూ డీఎంఈ డాక్టర్ నరసింహం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరుగురు ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించగా వారిలో ఎస్వీ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి, రుయాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభు, ఎస్వీ వైద్య కళాశాల చిన్నపిల్లల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ డి.మల్లీశ్వరి ఉన్నారు. వీరిలో డాక్టర్ రవిప్రభుకు రుయాస్పత్రి సూపరింటెండెంట్‌గా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ అదే స్థానంలో ఉంచగా డాక్టర్ మల్లీశ్వరిని పులివెందులలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు.



డాక్టర్ రవిప్రభు - డాక్టర్ మల్లీశ్వరి

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

రూ.2లక్షల సొత్తు స్వాధీనం

యాదమరి, మార్చి 16: అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.2 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వివరాలను యాదమరి పోలీసుస్టేషన్ ఆవరణంలో శనివారం రూరల్ సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐ రామాంజనేయులుతో కలిసి చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి మీడియాకు తెలిపారు. 2020 డిసెంబరు 13వ తేదీన చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలోని గుడిపాల వద్ద చెన్నై వైపు వెళ్తున్న మినీ లారీని అడ్డగించి అంతర్రాష్ట్ర దొంగల ముఠా అడ్డగించింది. మరణాయుధాలు చూపించి, డ్రైవర్ వద్ద నుంచి రూ.6200 దోచుకెళ్లింది. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పట్లో గుడిపాల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. అలాగే ఈనెల 14వ తేదీన తిరుపతి - బెంగళూరు రోడ్డులోని రామభద్రాపురం వద్ద బద్వేలు నుంచి నువ్వులు లోడుతో తమిళనాడుకు వెళ్తున్న లారీని అడ్డగించారు. డ్రైవర్‌ని కత్తులతో బెదిరించి, రూ.18వేలను దోపిడీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు యాదమరి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో ఈనెల 15న యాదమరి మండలం తుమ్మిందపాళ్యం క్రాస్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. తుమ్మిందపాళ్యం నుంచి యాదమరి వైపుగా రెండు ద్విచక్ర వాహనాల్లో వచ్చిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వీరే నిందితులుగా గుర్తించారు. వారి వద్ద నుంచి ఆరు కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, రూ.18వేలు, ఐదు కత్తులు, ఓ బ్లూటూత్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని డీఎస్పీ చెప్పారు. కేసు విచారణలో ఉందని, నిందితుల వివరాలను ప్రస్తుతం వెల్లడించలేమన్నారు. నిందితులను పట్టుకున్న రామారావు, గోపినాథ్, బాల, సుబ్రహ్మణ్యంలను డీఎస్పీ అభినందించారు.



మీడియాకు వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి

సంగీతంతో మానసిక ఆరోగ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 16 : సంగీతంతో మనిషి మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని జాతీయ సంస్కృత యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. పద్మావతి యూనివర్సిటీ సంగీత, నృత్య విభాగంలో రెండు రోజులుగా నిర్వహించిన జాతీయ సదస్సు ముగింపు సభ శనివారం నిర్వహించారు. వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తిగాన రసం ఫణి అనే శ్లోకాన్ని గుర్తు చేశారు. సంగీతం సకల జీవులను ఆహ్లాదమయం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సంగీతం పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. తద్వారా మానసిక ప్రశాంతతను పొందాలని ఆకాంక్షించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన సదస్సులో భాగంగా చేపట్టిన సమాంతర సదస్సుల్లో 32 పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ శైలేశ్వరి, కో-కన్వీనర్ ప్రొఫెసర్ యు.హిమబిందు పాల్గొన్నారు.



కార్యక్రమంలో విద్యాపీఠం వీసీ కృష్ణమూర్తి

మహిళ అనుమానాస్పద మృతి

వరదయ్యపాళెం, మార్చి 16: మండలంలో ఒంటరి మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఒకరోజు ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి వరదయ్యపాళెం పోలీసుల కథనం మేరకు వివరాలిలా... మండలంలోని పాండూరు పంచాయతీ పాదిరికుప్పంకు చెందిన అన్నంబేటి వసంత(43) భర్త వదలివేయడంతో 14 సంవత్సరాలుగా ఒంటరిగా పిల్లలతో జీవిస్తోంది. ఓ పరిశ్రమలో పనిచేస్తూ తన ఇద్దరు పిల్లలను పోషించుకుంటోంది. కుమారుడు (16) పుత్తూరులో ఇంటర్ చదువుతున్నాడు. కుమార్తె(14) సత్యవేడు మండలంలోని హాస్టల్‌లో ఉంటూ 9వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో కుమారుడికి ఇంటర్ పరీక్షలు ముగియడంతో శ్రువారం ఇంటికి వచ్చి చూడగా తల్లి ఉరి వేసుకుని ఉండటంతో భయపడి తాతకు తెలియజేయడంతో పోలీసులు సమాచారం ఇచ్చారు. సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐ ప్రతాప్ అక్కడికి చేరుకున్నారు. మూడు రోజుల క్రితం ఉరివేసుకున్నట్టు పోలీసులు నిర్ధారించారు. ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. తన పిల్లల పోషణ భారంగా మారడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు గోడకు రాసి ఉండటం గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



వసంత (పాతచిత్రం)

శ్రీకాళహస్తి టీడీపీలో అసమ్మతి ప్రచారాలకు తెర

- ఎస్సీవీ, మునిరామయ్యలతో సుధీర్‌రెడ్డి భేటీ

శ్రీకాళహస్తి, మార్చి 16: శ్రీకాళహస్తి టీడీపీలో విభేదాలున్నాయంటూ జరిగిన ప్రచారం పూర్తి అవాస్తవమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ప్రకటించారు. రెండు రోజుల క్రితం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థిగా బొజ్జల సుధీర్ రెడ్డి పేరును ప్రకటించిన విషయం తెలిసిందే. టికెట్ ఆశించిన ఎస్సీవీ నాయుడి వర్గం అసంతృప్తి ఎటువైపు దారితీస్తుందో అన్న ప్రచారం జోరుగా సాగింది.అయితే శనివారం ఎస్సీవీ ఇంటికి సుధీర్ రెడ్డి వచ్చారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, వెంకటగిరి, సత్యవేడు, తిరుపతి రూరల్ ప్రాంతాల్లో ఎస్సీవీ నాయుడికి మంచి పట్టుందన్నారు.సత్యవేడులో వైసీపీ నుంచి వచ్చిన వారికి తనను సంప్రదించకుండానే టికెట్ ప్రకటించడంపై ఎస్సీవీ నాయుడు కలత చెందిన విషయం వాస్తవమేనన్నారు.తనను ఆశీర్వదించి గెలిపిస్తే ఆయన అడుగుజాడల్లో పని చేస్తానని ప్రకటించారు. అలాగే ఆయనకు ఎమ్మెల్సీ లేదా రాజ్యసభ సభ్యత్వం వంటి గౌరవప్రద స్థానం కల్పించేందుకు పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేస్తానని చెప్పారు.ఇక శ్రీకాళహస్తిలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులను కూడా కలిసి ఒక్కటిగా ముందుకు సాగుతామన్నారు.మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు మాట్లాడుతూ భవిష్యత్ కార్యాచరణ సమావేశం కేవలం తనతోపాటు తన వర్గం నాయకులకు టీడీపీ అధిష్ఠానం నుంచి భరోసా పొందడంపై చర్చించేందుకే అన్నారు. గత ఎన్నికల్లో బియ్యపు మధుసూదన రెడ్డిని గెలిపిస్తే తీవ్ర ద్రోహం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఓటమి కోసమే తాను అహర్నిశలూ శ్రమిస్తానని ప్రకటించారు. అనంతరం సుధీర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే సత్రవాడ ముని రామయ్య ఇంటికి వెళ్లి తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.ఆయన కూడా సానుకూలంగా స్పందించి ఎన్నికల్లో అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. మొత్తంగా శనివారం జరిగిన పరిణామాలతో టీడీపీలో అసమ్మతి ప్రచారాలకు తెరపడింది.సుధీర్‌రెడ్డి వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గురవారెడ్డి, నాయకులు మునిరాజ నాయుడు, విజయ్‌కుమార్, కంఠా రమేష్ పాల్గొన్నారు.



ఎస్సీవీ నాయుడితో సుధీర్ రెడ్డి తదితరులు

వైసీపీ కార్యకర్తలా నగరపాలక కమిషనర్

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరోపణ

చిత్తూరు సిటీ, మార్చి 16: చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ క్రమశిక్షణ కలిగిన వైసీపీ కార్యకర్తలా పనిచేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. చిత్తూరు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి ఆదేశాలను ఆమె తూచా తప్పక పాటిస్తున్నారని విమర్శించారు. నగరంలో అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీలు ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తున్నాయని, టీడీపీకి చెందిన ఫ్లెక్సీలను మాత్రం తొలగించారని చెప్పారు. కమిషనర్ ఇలాగే ఉంటే.. చిత్తూరులో ఎన్నికలు స్వేచ్ఛగా జరిగే అవకాశం కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆమెను తక్షణం బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. అలాగే వలంటీర్లు, గ్రామ సచివాలయ, వెలుగు సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరామని అన్నారు. సమావేశంలో నేతలు మోహన్‌రాజ్, మేషాక్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

ముక్కంటి ఆలయంలో శాస్త్రోక్తంగా శాంతి అభిషేకం



అలంకార మండపంలో ఉత్సవర్లను అభిషేకిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, మార్చి 16: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో ఉత్సవమూర్తుల శాంతి అభిషేకం శాస్త్రోక్తంగా జరిగింది. మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిసిన తరవాతత రోజు ఉత్సవమూర్తులకు శాంతి అభిషేకం నిర్వహించడం సంప్రదాయం. ఇందులో భాగంగా శనివారం ముక్కంటి ఆలయంలోని అలంకార మండపం వద్ద విశేష పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అనువంశిక ప్రధానార్చకుడు స్వామినాథన్ గురుకుల్ కలశ స్థాపనతో సంకల్ప పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు విశేషాభిషేకాలను నిర్వహించారు. ఉత్సవాల్లో తెలియక పొరపాట్లు జరిగి ఉంటే ప్రాయశ్చిత్తంకోసం శాంతి హోమం చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ దర్శనాలపై అభ్యంతరం

ఎన్నికల నియమావళి అమలైనప్పటికీ రాజకీయ ప్రొటోకాల్ దర్శనాలు కొనసాగించడంపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ఆదివారం అధికార పార్టీ ఎమ్మెల్యే ముక్కంటి దర్శనానికి వస్తున్నట్లుగా.. వారికి ప్రొటోకాల్ దర్శనాలు చేయవలసిందిగా ఆలయంలోని ఓ కీలక అధికారి సిబ్బందికి మెసేజ్ పంపించారు. ఇది గ్రూపులో చూసిన ఆలయ ఉద్యోగులు ఎన్నికల నియమావళిలో కూడా ప్రొటోకాల్ దర్శనాలు కొనసాగించవచ్చా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అలాగే పలువురు దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు

తిరుమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 66,322 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,672 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోనా రఘుపతి, తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరని శ్రీనివాసులు, సినీ నిర్మాత అశ్వనీదత్, సంగీత దర్శకుడు తమన్, హీరో నాగ అశ్విన్ బాబు, ఎమ్మెల్సీలు పోతుల సునీత, సిపాయి సుబ్రహ్మణ్యం ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.



అశ్వినిదత్ - తమన్, అశ్విన్ బాబు

నేడు నామినికి మాండలిక బ్రహ్మ అవార్డు ప్రదానం

తిరుపతి (కల్చరల్), మార్చి 16: ప్రముఖ రచయిత నామిని సుబ్రహ్మణ్యం నాయుడికి ఆదివారం మాండలిక బ్రహ్మ అవార్డు ప్రదానం చేయనున్నారు. రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు గల్లా రామచంద్ర నాయుడు, గల్లా అరుణకుమారి, రమాదేవి ఈ అవార్డు ప్రదానం చేస్తారు. కరకంబాడీలోని అమరరాజా ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు శ్వేత సంచాలకులు భూమన్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ప్రజాకవి గోరటి వెంకన్న, ప్రముఖ పాత్రికేయుడు తాడి ప్రకాష్, గాయకుడు పుట్టా పెంచలదాసు హాజరుకానున్నారు.

రేపటి నుంచి రీసెర్చ్ మెథడాలజీపై కోర్సు ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 16 : ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ పరిధిలో రీసెర్చ్ మెథడాలజీపై వారం పాటు ప్రత్యేక కోర్సు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి ఈ కోర్సును ప్రారంభించనున్నారు. పరిశోధనా విధానంపై పీహెచ్‌డీ స్కాలర్లకు అవగాహన కల్పిస్తారు. ఆర్ట్స్ కాలేజీ పరిధిలోని అన్ని విభాగాలకు చెందిన పీహెచ్‌డీ స్కాలర్లు తప్పనిసరిగా హాజరుకావాలని అధికారులు కోరారు. ఈ మేరకు వర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మనాభం, వైస్ ప్రిన్సిపాల్ శ్యాంమోహన్‌డేవిడ్‌రాజు తెలిపారు.

సైబర్ నేరగాడి అరెస్టు

తిరుపతి క్రైం మార్చి 16 : ఆన్‌లైన్ ద్వారా మోసాలకు పాల్పడుతున్న నేరగాడిని శనివారం తిరుపతి యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతి సీఐడీ పోలీసుల వివరాల మేరకు.. తిరుపతికి చెందిన మరిచర్ల బాలాజీ ఓఎల్ఎక్స్‌లో పాత మొబైల్ ఫోన్లు అమ్మే నిమిత్తం ప్రకటనలు పోస్టు చేస్తాడు. ఫోన్ కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తిని నేరుగా కలిసి ఫోన్ చూడమని చెబుతాడు. అవతలి వ్యక్తికి ఫోన్ నచ్చితే తను చెప్పిన నంబరుకు యూపీఐ ద్వారా నగదు బదిలీ చేయించుకుంటాడు. నగదు బదిలీ అయిన తర్వాత ఈ విషయం ఎవరికీ చెప్పవద్దని, ఇప్పుడే ఫోన్ తీసుకుని వస్తానని చెప్పి అక్కడి నుంచి ఉడాయిస్తున్నాడు. తర్వాత సదరు నంబర్‌ను బ్లాక్ చేస్తున్నాడు. ఇదే తరహాలో మోసపోయిన షేక్ ఫయాజ్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు బాలాజీని పట్టుకుని విచారించగా అతనిపై 23కేసులు ఉన్నట్లు సైబర్ క్రైం పోర్టల్ ద్వారా పోలీసులు గుర్తించారు.



పోలీసుల అదుపులో బాలాజి

శ్రీకాళహస్తీశ్వరుడి సేవలో ఐపీఎస్ అధికారి

శ్రీకాళహస్తి, మార్చి 16: తమిళనాడుకు చెందిన ఐపీఎస్ అధికారి, ఇంటిలిజెన్స్ డైరెక్టర్ జనరల్ ప్రమోద్ కుమార్ శనివారం ముక్కంటి ఆలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అధికారులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.



మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, మార్చి 16: మురకంబట్టు సమీపంలో ఉన్న మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చేరాలకునే వారు దరఖాస్తులు చేసుకోవాలని హెచ్ఎం ఆంజినేయులురాజు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు జిల్లాల విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

బ్యానర్ల తొలగింపు



పన్నూరు సబ్‌స్టేషన్‌లో వైఎస్ విగ్రహానికి వేసిన ముసుగు

విజయపురం, మార్చి 16: మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్, విజయపురం కూడలి ప్రాంతాలలో రాజకీయ పార్టీ బ్యానర్‌లను శనివారం రెవిన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బంది తొలగించారు. రాజకీయ నాయకుల విగ్రహాలను వస్త్రంతో కప్పి ఉంచారు. గ్రామాల్లో ఎక్కడా రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, ఫ్లెక్సీలు ఉంటే వెంటనే తొలగించాలని తహసీల్దార్ మల్లికార్జున రావ్ ఆదేశించారు.

నాయకుల ఫొటోలు తొలగించండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణకుమారి

తవణంపల్లె, మార్చి 16: ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినందున మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గల రాజకీయ నాయకుల ఫొటోలను వెంటనే తొలగించాలని కార్యాలయాల సిబ్బందిని తహసీల్దార్ అరుణ కుమారి ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, ఎంఈవో హేమలత, వీఆర్వోలు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, పోస్టర్లు, బ్యానర్లను తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీ వెంకటరమణ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వేడుకగా యాళి, సింహ వాహన సేవలు



వాహనసేవ ముందు ఉభయదారులు

చిత్తూరు కల్చరల్, మార్చి 16: నగరంలోని కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం స్వామివారు యాళి, సింహ వాహ నాలపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. యాళి వాహనసేవకు వై.జయచంద్రనాయుడు, సింహ వాహనసేవకు గురునాథ థియేటర్ యజమానులు బాలగురునాథ్, కమలమ్మ ఉభయదారులుగా వ్యవహరిం చారు. ఆలయ అర్చకులు శివాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఛైర్మన్ శివప్రసాద్, ఈవో తిమ్మారెడ్డి పాల్గొన్నారు. కాగా ఆదివారం ఉదయం కేడియ ఉత్సవం, సాయంత్రం కామధేను వాహన సేవలు జరగనున్నాయి.

టీడీపీ జెండాలతో యువత భారీ ర్యాలీ



గాలి భానుప్రకాష్‌ను గజమాలతో సత్కరిస్తున్న యువత

నగరి, మార్చి16: నగరి పట్టణ పరిధిలోని సాయిబాబా గుడి నుంచి టీడీపీ కార్యాలయం వరకు కొత్తగా ఓటర్లుగా నమోదైన యువత టీడీపీ పతాకాలతో 100 మోటార్ సైకిళ్లపై శనివారం భారీగా ర్యాలీ నిర్వహించారు. జై భాను...జై టీడీపీ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం కొత్తగా ఓటుహక్కు పొందిన సుమారు 100 మంది ఇంజనీరింగ్ యువత టీడీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో పసుపు కండువాలు కప్పుకున్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని భానుప్రకాష్ కోరారు.

ఎన్నికల నియమావళి విధిగా పాటించాలి



సూచనలిస్తున్న ఆర్వో వెంకటరెడ్డి

నగరి, మార్చి16: ఎన్నికల నియమావళి విధిగా పాటించాలి అని నగరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వెంకటరెడ్డి సూచించారు. శనివారం నగరి ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో, అధికారులతో నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నరసింహ మూర్తి, తహసీల్దార్ చంద్ర శేఖర్‌రెడ్డి, టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

దోమలకు ఆవాసంగా 5వ వార్డు



దుర్గంధం వెదజల్లుతున్న మురుగుకుంట

చిత్తూరు రూరల్, మార్చి 16: చిత్తూరు నగరం క్లీన్ సిటీ, గ్రీన్ సిటీ అని నగరపాలక సంస్థ ఊదరగొడుతోంది. అయితే అంత సీను లేదంటున్నారు నగరంలోని 5వ వార్డు, ఫైదా ఫ్యాక్టరీ వద్ద ఉన్న వావి ఎన్‌క్లేవ్ లేఅవుట్ స్థానికులు. నివాసాల మధ్యన పెద్ద మురుగుకుంట ఏర్పడిందని, దీని కారణంగా దోమలు పెరిగి రోగాలు బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మురుగుకుంట ద్వారా వచ్చే దుర్వాసనకు పిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన చెందుతున్నారు. సచివాలయ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ స్పందించి మురుగు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సైకిల్ గుర్తుకే ఓటేయండి



గాజుల కండ్రిగలో ప్రచారం చేస్తున్న థామస్

కార్వేటినగరం, మార్చి 1: రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని జీడీనెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ కోరారు. శనివారం కార్వేటినగరం మేజర్ పంచాయితీ పరిధిలో గాజులకండ్రిగ, సుద్దగుంట, చిన్నతోపు, గిరిజన కాలనీ, పెద్ద దళితవాడ గ్రామాలలో ఆయన ప్రచారం చేశారు. మండల అభి వృద్ధికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్థన్‌రాజు, నాగేశ్వరరాజు, జనసేన నాయకులు యుగంధర్, టీడీపీ నాయకులు రాయల్ యాదవ్, రాజేందర్‌రెడ్డి, దాము, తిరుమనాథ్, జగన్నాథం, త్యాగరాజు, కృష్ణంరాజు, గుంగయ్య, చెల్లయ్య పాల్గొన్నారు.

ఆలయం వద్ద అన్నదానం



కార్వేటినగరం, మార్చి 16: టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. 100 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయం వద్ద అన్నదానం చేయడానికి ఆసక్తి ఉన్న భక్తులు ముందుగా తమ పేర్లను ఆలయంలో నమోదు చేసుకోవాలని ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ కోరారు.

ఫ్లెక్సీల తొలగింపు

కార్వేటినగరం, మార్చి 16: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో కార్వేటినగరం గాండ్లమిట్ట వద్ద రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను అధికారులు తొలగించారు.

చెరకు పంట దగ్ధం

వెదురుకుప్పం, మార్చి 16: మండలంలోని ఆళ్లమడుగుకు చెందిన కె.గోవిందమ్మ చెరకు పంట శనివారం అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. సమీపంలోని అడవికి ఎవరో నిప్పు పెట్టడంతో ఆ మంటలు తన రెండెకరాల చెరకు తోటకు వ్యాపించి కాలిపోయిం దని రూ.60వేలు నష్టం వాటిల్లిందని వాపోయింది. వీఆర్వో హేమాద్రిరెడ్డి చెరకు తోటను పరిశీలించారు.

టీడీపీ అభ్యర్థిని గెలిపించండి



థామస్‌తో తెలుగు యువత నియోజక వర్గ ఉపాధ్యక్షుడు

వెదురుకుప్పం, మార్చి 16: గంగాధరనెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్‌ను గెలిపించాలంటూ శనివారం దేవళంపేటలో ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. సూపర్ సిక్స్‌కు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రచారంలో క్లస్టర్ ఇన్‌చార్జి కె.చెంగ్రాయరెడ్డి, బూత్ కమిటీ కన్వీనర్ శ్రీరాములునాయుడు, సీనియర్ నాయకులు వి.నాగరాజారెడ్డి, ప్రకాశ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

● థామస్ విజయానికి కృషిచేస్తామని తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి తెలిపారు. థామస్‌ను కలిసి ఆళ్లమడుగులోని పార్టీ పరిస్థితులను వివరించారు.

రంజాన్ తోఫా పంపిణీ



గుడిపాల, మార్చి 16: జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా శనివారం పేయనపల్లిలోని ముస్లింలకు సర్పంచ్‌లు అరుణ్‌కుమార్, గీత రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జయచంద్రనాయుడు, లోకనాథం నాయుడు, రవినాయుడు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించండి

పాలసముద్రం, మార్చి 16: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో మండలంలో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు తొలగించాలని, నాయకుల విగ్రహాలకు ముసుగు వేయాలని తహసీల్దార్ జయలక్ష్మి ఆదేశించారు. శనివారం వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో రెవిన్యూ కార్యాలయంలో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో సీఎం జగన్ ఫొటోలను సైతం తొలగించాలని స్పష్టం చేశారు.

బంగారుపాళ్యం పంచాయతీకి రూ.15.31 లక్షల ఆదాయం

బంగారుపాళ్యం, మార్చి 16: బంగారుపాళ్యం మేజర్ పంచాయతీ దినసరి, వారపు సంతకు శనివారం పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా రూ.15.31 లక్షల ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి శంకరయ్య తెలిపారు. రజినీకాంత్ రూ.15.31 లక్షలకు ఈ సంతలను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉమాదేవి, వైస్ సర్పంచ్ కామరాజ్ పాల్గొన్నారు.

నేటితో రాక్షసపాలన నుంచి విముక్తి : గురజాల



సమావేశంలో మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, మార్చి 16: నేటితో రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ రాక్షసపాలన నుంచి విముక్తి లభించిందని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని లక్ష్మీనగర్ కాలనీలోని జీజేఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ ఐదేళ్ల పాలన కూల్చివేతలు, విధ్వంసాలు, దౌర్జన్యాలు, కక్షలు, వేధిపులతోనే సాగిందన్నారు. తాడేపల్లెలో కూర్చొని ఐదుగురు మంత్రులతో పాలన సాగించి అభివృద్ధి, సంక్షేమాన్ని గాలికొదిలేశారని చెప్పారు. తల్లి, చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి రాష్ట్ర ప్రజలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. సొంత చెల్లెల్లే జగన్‌కు ఓట్లు వేయొద్దని ప్రజలకు చెబుతున్నారని, దీనికి ఆయన ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. అమరావతిని సీఎం జగన్ నిర్వీర్యం చేశారన్నారు. పోలవరం ప్రాజెక్టును గాలికొదిలేశారని అన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం బాగుపడుతుందని స్పష్టంచేశారు. మరో 45 రోజుల్లో రాష్ట్ర ప్రజలకు పూర్తి స్వేచ్ఛ లభిస్తుందన్నారు. యువతకు ఉద్యోగులు వస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు సురేంద్రకుమార్, కోదండయాదవ్, మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, యువరాజులు నాయుడు, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

గురజాల విజయానికి కృషిచేస్తాం



మాజీ ఎంపీపీని కలిసిన గురజాల సతీమణి ప్రతిమ

చిత్తూరు రూరల్, మార్చి 16: చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురుజాల జగన్మోహన్ విజయానికి శక్తించన లేకుండా కృషి చేస్తామని చిత్తూరు మాజీ ఎంపీపీ సునితా, టీడీపీ జిల్లా కార్యదర్శి జయచంద్రనాయుడు తెలిపారు. శనివారం చిత్తూరు రూరల్ మండలంలో గురుజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ పలు పంచాయతీల్లో పర్యటించారు. అందులో భాగంగా మాజీ ఎంపీపీ సునీతను స్వగ్రామమైన అనంతాపురంలో కలిసి మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, మహిళా నాయకురాలు కార్జాల అరుణ, పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల నియమావళి అమలు

●నగరంలో పోస్టర్లు, బ్యానర్లు తొలగింపు ● ఏఆర్వో, కమిషనర్ విస్తృత తనిఖీలు



గోడలకు తెల్ల రంగు వేయిస్తున్న ఏఆర్వో అరుణ

చిత్తూరు, మార్చి 16: ఎన్నికల నియ మావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో నగరంలో ఎన్నికల నియమావళిని పక్కాగా, పారదర్శకంగా అమలు చేయాలని ఏఆర్వో, కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. ఎన్నికల నియమావళి ప్రకారం నగరంలో ఎక్కడా రాజకీయపరమైన పోస్టర్లు, బ్యానర్లు కనిపించరాదన్నారు. శనివారం నగరంలో పోస్టర్లు, బ్యానర్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. అన్ని వార్డులోనూ నగరపాలక అధికారులు, వార్డు కార్యదర్శులు, సిబ్బంది జల్లెడపట్టి పోస్టర్లు, బ్యానర్లను తొలగించారు. గోడలు, విద్యుత్ స్తంభాలపై రాసిన వాటిపై తెలుపురంగు పెయింటింగ్ వేయించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన పోస్టర్లను తొలగించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంహెచ్‌వో చిన్నయ్య, ఏసీపీ రామకృష్ణుడు, సీఎంఎం గోపి, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగించండి..విగ్రహాలకు ముసుగేయండి

చిత్తూరు, మార్చి 16: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో నగరపాలక పరిధిలోని అధికారులు, ఉద్యోగులు పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఏఆర్వో అరుణ సూచించారు. శనివారం సాయంత్రం ఆమె అధికారులు, వార్డు కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వార్డు సచివాలయాల్లో ఎలాంటి రాజకీయపరమైన సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లు, డిస్‌ప్లే బోర్డులు ఉండకూడదన్నారు. నగరంలోని దివంగత నేతల విగ్రహాలకు ముసుగువేయాలన్నారు. శిలాఫలకాలను మూసివుంచాలన్నారు. వార్డులో ఎక్కడా కొత్త పనులు చేపట్టరాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె మహిళామార్టు, నగరపాలక కార్యాలయంలోని బిల్లింగ్ కౌంటర్ల విభా గాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈ గోమతి, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు ప్రజలకు సేవచేసేందుకే వచ్చా



గురజాలకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

గుడిపాల, మార్చి 16: కర్ణాటకలో కాంగ్రెస్ తరఫున సీటు వచ్చినా వద్దనుకుని తాను పుట్టిన గడ్డ అయిన చిత్తూరు నియోజకవర్గానికి సేవ చేయడానికి వచ్చానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌నాయుడు అన్నారు. శనివారం మండలంలోని క్రిష్ణజిమ్మాపురం గ్రామస్తులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మునీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిత్తూరు నియోజకవర్గాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడంతో పాటు అన్ని వర్గాలవారిని అభివృద్ధి పరచడమే ధ్యేయంగా రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల కన్వీనర్ రూప్ కుమార్, మాజీ జడ్పీటీసీ సభ్యులు బాలాజీ నాయుడు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు బాబు, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, రమేష్‌నాయుడు, గుర్రప్ప నాయుడు, చందు, రఘునాయుడు, రవినాయుడు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి



నగరి, మార్చి16: వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఎస్ఈ కృష్ణారెడ్డి సూచించారు. నగరి నియోజకవర్గంలోని నిండ్ర, విజయపురం, నగరి మండలాల్లోని పన్నూరు, కాళికాపురం, నిండ్ర, కొప్పేడు, ఎం.కొత్తూరు విద్యుత్ ఉప కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతున్నందున విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక సిబ్బందికి సూచనలిచ్చారు. అలాగే వేసవి ప్రారంభమైనందున ట్రాన్స్ ఫార్మర్లు మరమ్మతుకు గురయ్యే అవకాశం ఉంటుంటుందని క్షేత్రస్థాయిలో సిబ్బంది తరచూ పర్యవేక్షిస్తుండాలని సూచించారు.

ఎం.కొత్తూరు విద్యుత్ ఉపకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

చిత్తూరు (సెంట్రల్), మార్చి 16: మహిళా సంఘం సభ్యులు ఆర్థిక ప్రణాళిక రూపొందిం చుకోవాలని డీఆర్‌డీఏ పీడీ తులసి సూచించారు. శనివారం స్థానిక జిల్లా సమాఖ్య సమావేశ మంది రంలో ఆర్‌బీఐ సౌజన్యంతో 'డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పొదుపు ప్రాముఖ్యత, నిర్బంధ పొదుపు, స్వచ్ఛంద పొదుపు లాభాలను వివరించారు. ప్రతి మహిళా బీమా పెన్షన్ చేసుకో వాలని సూచించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ హరీష్ మాట్లాడుతూ బ్యాంకింగ్ లావాదేవీలపై డిపాజిటర్లకు అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్ఈటీఐ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, ఎస్‌జీబీ ఎఫ్ఎల్‌సీ జయశేఖర్, బ్యాంకు లింకేజ్ యాంకర్ నాగేశ్వరరావు, చిత్తూరు మండల సంఘం సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘననివాళి



పొట్టి శ్రీరాముల విగ్రహం వద్ద రచయితల సంఘం ప్రతినిధులు

చిత్తూరు కల్చరల్, మార్చి 16: స్థానిక గంగినేని చెరువు పార్కులో శనివారం చిత్తూరు జిల్లా రచయితల సంఘం, ఆర్యవైశ్య ప్రతినిధుల ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాముల 124వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు కట్టమంచి బాలక్రిష్ణారెడ్డి, రచయిత్రి అరుణకుమారి, మన సంస్కృతి సంస్థ నిర్వాహకులు సహదేవనాయుడులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అదేవిధంగా నగరంలోని ఆర్యవైశ్య ప్రతినిధులు సకల వెంకటేశంగుప్తా, మోహన్, శ్రీకలెక్షన్ బద్రీనారాయణ. ఓవీసీ జ్యూలరీస్ అధినేత రమేష్ తదితరులు అమరజీవికి నివాళులు అర్పించారు.

చిత్తూరు: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అమరజీవికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, ఏవో మోహన్‌రావు, ఏఏవో దస్తగిరి పాల్గొన్నారు.

చిత్తూరు సిటీ: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ గంగినేని చెరువు సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చిట్టిబాబు, ఆరణి కవిత తదితరులు పాల్గొన్నారు.

నరసింహులుకు టికెట్ ఇస్తే కాంగ్రెస్‌కు నష్టమే



మాట్లాడుతున్న చందురాణి

శ్రీరంగరాజపురం, మార్చి 16: పీసీసీ మెంబరు డాక్టర్ నరసింహులుకు గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే టికెట్ ఇస్తే కాంగ్రెస్ పార్టీకే నష్టమని జిల్లా కాంగ్రెస్ కమిటీ మహిళా అధ్యక్షురాలు చందురాణి తెలిపారు. శనివారం ఎస్ఆర్ పురం మండలం మర్రిపల్లెలో నిర్వహించిన పార్టీ ముఖ్యుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పాలసముద్రానికి చెందిన సీనియర్ నాయకులు మణికృష్ణకు టికెట్ ఇవ్వాలని కోరారు. ఆమె వెంట కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు కన్నన్, మణికృష్ణ, సుబ్బరాయులు, పుష్పరాజ్, మోహన్, పిచ్చయ్య ఉన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు ఉమ



వెదురుకుప్పం, మార్చి 16: వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న ఉమ జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్ జట్టుకు ఎంపికైందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ రమేష్ శనివారం తెలిపారు. శుక్రవారం అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభకనపరిచిన ఆమెను ఎంపిక చేశారని చెప్పారు. ఈ నెల 29వ తేది నుంచి ఔరంగాబాద్‌లో జరగబోవు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. ఆ పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ డాక్టర్ మునికృష్ణయ్య, హెచ్ఎం, ఉపాధ్యాయులు శనివారం ఆ పాఠశాలలో అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చిత్తూరు, మార్చి 16: చిత్తూరు నియోజకవర్గంలో ప్రమాదాలు, వ్యాధులతో ఇబ్బందులు పడుతూ చికిత్స పొందుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి అందించారు. గుడిపాల, చిత్తూరు రూరల్ మండలం, చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని సతీష్‌బాబుకు రూ.3 లక్షలు, సుబ్రహ్మణ్యంకు రూ.2 లక్షలు, షేక్ అబ్దుల్ జహార్‌కు రూ.65వేలు, నవ్యశ్రీకి రూ. 85వేలు, సహీదకు రూ. 60వేలు, పవనన్నమ్మకు రూ. 55వేల చెక్కులను అందించారు.

జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షురాలిగా ధనలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కాణిపాకం ధనలక్ష్మి

చిత్తూరు సిటీ, మార్చి 16: కాంగ్రెస్ పార్టీ చిత్తూరు జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షురాలిగా కాణిపాకం ధనలక్ష్మి నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు కలికిరి నారాయణస్వామి, పరదేశి పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



గోవర్ధన్‌రెడ్డి

చిత్తూరు కల్చరల్/పెనుమూరు మార్చి 16: శ్రీవెంకటేశ్వరా విశ్వవిద్యాలయం కామర్స్ విభాగంలో పీహెచ్‌డీ చేసిన వి.గోవర్ధన్‌రెడ్డికి విశ్వవిద్యాలయ మేనేజ్‌మెంట్ డాక్టరేట్ పట్టా అందజేశారు. ప్రొఫెసర్ వీ.నర్సయ్య పర్యవేక్షణలో 'మేనేజ్‌మెంట్ ఆఫ్ వర్కింగ్ క్యాపిటల్ ఇన్ సెలెక్ట్ సిమెంట్ కంపెనీస్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై పరిశోధన చేశారు. గోవర్ధనరెడ్డిని పలువురు అభినందించారు.

కేంద్రబలగాల కవాతు

విజయపురం, మార్చి 16: సమస్యాత్మక గ్రామాల్లో కేంద్రబలగాలతో కలసి పోలీసులు కవాతు నిర్వహించారు. శనివారం మండలంలోని విజయపురం దళితవాడ, గంగమాంబాపురం, పన్నూరు సబ్‌స్టేషన్, పన్నూరు గ్రామాల్లో కవాతు చేపట్టాయి. ప్రజలు స్వేచ్ఛగా ఓటువేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ జయప్ప, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిండ్ర: నిండ్రలో శనివారం నగరి రూరల్ సీఐ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించారు. ఎస్ఐ రామచంద్ర, ఏఎస్ఐ ఎలుమలై, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు మంచిపేరు తేవాలి

వెదురుకుప్పం, మార్చి 16: విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని దేవళంపేట జడ్పీ ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ ఉమాపతి కోరారు. శనివారం ఆ పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ఎంపీటీసీ కొత్తపల్లి భాస్కర్, మాజీ ఎంపీపీ చంగల్‌రెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.